

నేడు స్పందన రద్దు

కలెక్టరేట్/శ్రీకాకుళం క్రై, మార్చి 10: జిల్లా కేంద్రంలో సోమవారం జరిగే కలెక్టర్ స్పందన, ఎస్పీ స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు డీఆర్వో ఎం.గణపతిరావు, ఎస్పీ రాధిక ఆదివారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఎన్నికల శిక్షణ తరగతులు జరగనున్న కారణంగా స్పందనను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని తెలిపారు. ఎవరూ జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు. పోలీసు స్టేషన్లలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని, వాటిని తాను పరిశీలిస్తానని ఎస్పీ తెలిపారు.

వైసీపీ పతనానికి నాంది

- కూటమి విజయం నల్లేరుపై నడక
- నిజాయితీతో పనిచేసే పార్టీకి, నాయకత్వానికి పట్టం కట్టండి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

నందిగాం/టెక్కలి, మార్చి 10: 'రాష్ట్రంలో ఏర్పాటైన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైసీపీ పతనానికి నాంది. కూటమి విజయం నల్లేరుపై నడకేనని' టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం నందిగాం మండలం హర్షబాడ పంచాయతీ మలియాలింగుపురంలో జరిగిన గిరిజన సభలో, జడ్యాడలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ఐదుకోట్ల మంది ప్రజలు ఆలోచన చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిందేమీ లేదని, హరిజన, గిరిజనుల్ని ఊచకోతకు గురిచేసి భయభ్రాంతులకు గురిచేసిందని ఆరోపించారు. 'రాజ్యాంగ విలువలు లేని జగన్‌రెడ్డికి ఓటు అడిగే హక్కు లేదు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా ట్రైకార్ రుణాలు అందించి వారికి భరోసా కల్పించాం. ఈ ప్రభుత్వంలో కనీసం సబ్‌ప్లాన్ నిధులు కూడా ఖర్చు చేయలేదు. టీడీపీ అమలుచేసిన 94 సంక్షేమ పథకాలను ఎత్తివేసిన ఘనత వైసీపీకే దక్కుతుంది. ఈ ప్రాంత ప్రజలు గుర్తుపెట్టుకునేలా అభివృద్ధి చేస్తా. నాకు అండగా నిలబడండి. న్యాయబద్ధంగా, నిజాయితీతో పనిచేసే పార్టీకి, నాయకత్వానికి పట్టం కట్టండి. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ చేసిందేమీ లేదు. రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే మెళియాపుట్టి, టెక్కలి మండలాల సరిహద్దు ప్రాంతంలో 50 ఎకరాల విస్తీర్ణంలో ఐటీడీఏను ఏర్పాటు చేసి గిరిజనులకు పూర్తి సదుపాయాలు కల్పించే బాధ్యత తీసుకుంటాం. జీవో నెం.3ను తీసుకువచ్చి గిరిజనుల ఆత్మగౌరవాన్ని మంటగల్పిన జగన్‌కు బుద్ధిచెప్పాలి.' అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గిరిజనుల సంప్రదాయం ఉట్టిపడేలా విద్యార్థినులు థింసా నృత్యం చేసి అచ్చెన్నకు స్వాగతం పలికారు.

టీడీపీలో భారీగా చేరికలు

నందిగాం మండలంలోని మలియాలింగుపురం, మొగిలిపాడు, సవరరాంపురం, చిన్నగురువూరు, పెద్దగురువూరు, సవరబడగాం తదితర గిరిజన గ్రామాలతో పాటు బడగాం మాజీ సర్పంచ్ సవర కలవయ్య, గిరిజన సంఘ నాయకులు మొగిలిపాటి జగ్గారావు తదితరులు టీడీపీలో చేరారు. అలాగే జడ్యాడలో ప్రముఖ పారిశ్రామికవేత్త లైసెట్టి నారాయణరావుతో పాటు నల్ల నారాయణ, కింతలి జనార్దనరావు, మల్లేశ్వర రావు, నేతాజీ, దుంపల నందేసు, బమ్మిడి నారాయణ, రోణంకి అప్పలనరసమ్మ, కందా కాంచన, గొల్లూరు పాపారావు, రాకోటి రమేష్ తదితర 22 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి అచ్చెన్నాయుడు పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. అలాగే జనసేన పార్టీలో కె.శశిభూషన్, శంకరరావు, ఎల్.కృష్ణారావు, జె.కుమారస్వామి, ఇ.వెంకటరమణ తదితరులు చేరారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.నాగరాజు, నాయకులు ఎం.బాలకృష్ణ, లోకనాథం, విజయకుమారి, కామేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, టెక్కలి ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, తూలుగు ఉమామహేశ్వరరావు, కె.హరిబాబు, ఎస్.షణ్ముఖ రావు, కె.విశ్వనాథం, ఎం.సింహాచలం, ఎస్.తిరుపతిరావు, ఎం.మోహన రావు, తాడేల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.




తెలుగుదేశం పార్టీలో చేరిన నందిగాం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు

రుణాలు ఇవ్వట్లే!

- స్వయం సహాయక సభ్యులకు మంజూరు కాని కొత్త లోన్లు
- బ్యాంకర్ల తీవ్ర నిర్లక్ష్యం
- మూడు నెలలుగా పెండింగ్
- ఆందోళనలో మహిళలు

(రణస్థలం)

స్వయం సహాయక సంఘ సభ్యులకు కొత్త రుణాలు అందించడంలో బ్యాంకర్లు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. దరఖాస్తులు చేసి నెలలు గడుస్తున్నా రుణాలు మంజూరు చేయకుండా బ్యాంకర్లు మోకాలడ్డుతున్నారు. దీంతో సహాయక సంఘ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 30 మండలాల్లో 1,286 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వాటి పరిధిలో 49,022 సంఘాల్లో 5.5 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. ప్రతీ మండలంలో సంఘాల సంఖ్య ఆధారంగా ముగ్గురు లేదా నలుగురు సీసీలు ఉన్నారు. ప్రతీ సీసీ కింద ఇద్దరు సీఆర్పీలు (ఆడిటర్లు) ఉంటారు. వారు గ్రామాల పరిధిలో సంఘాల పనితీరు, లావాదేవీలు, పొదుపు, అప్పు, అంతర్గత అప్పులు, బ్యాంకు తీర్మాన పుస్తకాల నిర్వహణను పరిశీలిస్తారు. అయితే ఈ ప్రక్రియలో పనితీరు మెరుగుపడినా బ్యాంకర్లు రుణాలకు మోకాలడ్డుతుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. వాస్తవానికి స్వయం సహాయక సంఘాల లావాదేవీలకు ఏ బ్యాంకు అయినా మొగ్గు చూపుతుంది. దానికి పటిష్టమైన వ్యవస్థ ఉంటుంది.



- రణస్థలం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన కొందరు మహిళలు నీలమ్మ తల్లి స్వయం సహాయక సంఘంగా ఏర్పడ్డారు. కొత్తగా ఏర్పడిన ఈ సంఘం రుణం కోసం గతేడాది డిసెంబరులో బ్యాంకుకు దరఖాస్తు చేసుకున్నారు. గత మూడు నెలలుగా అదిగో ఇదిగో అంటూ బ్యాంకు అధికారులు తిప్పుతున్నారే తప్ప రుణాలు అందించిన దాఖలాలు లేవు.
- రణస్థలం మండలం గోశాం అయ్యప్ప స్వయం సహాయక సంఘ సభ్యులు రూ.23వేలు రుణం బ్యాంకుకు చెల్లించాల్సి ఉంది. అయినప్పటికీ కొత్త రుణం తీసుకొనే అర్హత ఉంది. దీంతో కొత్త రుణం కోసం వెలుగు సిబ్బంది సంఘం ధ్రువపత్రాలతో బ్యాంకుకు గతేడాది డిసెంబరులో దరఖాస్తు చేసుకున్నారు. కానీ, మూడు నెలలు గడుస్తున్నా ఇంత వరకూ కొత్త రుణం అందించలేదు.
- జేఆర్‌పురం గ్రామానికి చెందిన భవాని స్వయం సహాయక సంఘం కొత్త రుణం కోసం గతనెల ఫిబ్రవరి రెండో వారంలో దరఖాస్తు చేసుకుంది. అదేనెల 16న సంఘ సభ్యులను బ్యాంకు సిబ్బంది పరిశీలించారు. వారం రోజుల్లో రుణం ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదు.



జేఆర్‌పురంలో స్వయం సహాయక సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న సీఎఫ్ (ఫైల్)

వెలుగు సిబ్బంది బాధ్యులుగా ఉంటారు. రుణాల చెల్లింపులు, రెన్యూవల్స్ దాదాపు సక్రమంగా పూర్తవుతాయి. కానీ, కొన్ని బ్యాంకులు మాత్రం ఎందుకోని ర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. రణస్థలంలో యూనియన్ బ్యాంకు అధికారులు ఇబ్బందిపెడుతుండడంతో కెనరా బ్యాంకు శాఖకు చాలామంది మారిపోయినట్టు వెలుగు అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. ఇదే పరిస్థితి అన్ని మండలాల్లో ఉంది.

రుణాలు అడిగితే కుంటిసాకులు

పేదరిక నిర్మూలన, మహిళా సాధికారితలో భాగంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటయ్యాయి. గతంలో ఒక్కో మహిళ రూ.30నుంచి పొదుపు చేయగా.. ప్రస్తుతం రూ.100 నుంచి రూ.500 వరకూ చేస్తున్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు కూడా గతంలో రూ.10 వేల నుంచి రూ.50 వేలు అందించేవారు. ఇప్పుడు మహిళల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు గాను ఎటువంటి తనఖా లేకుండా నేరుగా ఒక్కో గ్రూపునకు గరిష్ఠంగా రూ.20 లక్షల వరకూ మంజూరు చేస్తున్నాయి. అయితే ఇందులో ఎక్కువ సంఘాలు సకాలంలో రుణాలు చెల్లిస్తున్నాయి. కానీ కొత్త రుణాలు చెల్లించడంలో బ్యాంకర్లు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదేమని బ్యాంకు అధికారులను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. సిబ్బంది లేరని కుంటిసాకులతో కాలం వెళ్ల దీస్తున్నారు. దీంతో వేలాది మంది మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టిసారించాలని స్వయం సహాయక సంఘాల సభ్యులు కోరుతున్నారు.

రణస్థలంలో అంతులేని నిర్లక్ష్యం

రణస్థలం మండలంలో 950 మంది స్వయం సహాయక సభ్యులు కొత్త రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. రణస్థలం మండల కేంద్రంలో ఉన్న యూనియన్ బ్యాంకులో సభ్యులు తమ ధ్రువపత్రాలు అందించి మూడు నెలలు గడుస్తున్నా రుణాలు అందించడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలో మరో రెండు గ్రామాల్లో ఉన్న యూనియన్ బ్యాంకు శాఖల్లో రుణాల చెల్లింపు ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నా.. మండల కేంద్రంలో మాత్రం అంతులేని నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఇదే విషయమై రణస్థలం యూనియన్ బ్యాంకు మేనేజర్ సంగీతను వివరణ కోరగా.. రుణాలు సక్రమంగానే చెల్లిస్తున్నామని చెప్పుకొచ్చారు. స్వయం సహాయక సంఘాలు ధ్రువపత్రాలు సమర్పిస్తే పిలిచి రుణాలు ఇస్తున్నామన్నారు. అయితే ఫిబ్రవరి నెలకు సంబంధించి ఎంత రుణాలు ఇచ్చారని ప్రశ్నిస్తే.. ఆమె నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. 'అది మా ఉన్నతాధికారులకు చెబుతాం. మీకు చెప్పాల్సిన అవసరం లేదని' అన్నారు.

చర్యలు తీసుకుంటాం

అర్హత ఉన్న స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇవ్వాల్సిందే. మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించడానికే బ్యాంకులు ఉన్నాయి. రుణాల మంజూరులో ఎవరైనా బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లు తెలిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ఎండీ తిలక్, ఏజీఎం, యూనియన్ బ్యాంకు

సర్వం సిద్ధం

- నేడు శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 300 మంది పోలీసులతో బందోబస్తు


జలుమూరు/ఎల్.ఎన్.పేట, మార్చి 10: శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాలకు సర్వం సిద్ధమయ్యింది. మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఎల్.ఎన్.పేట మండలం మిరియాపల్లి వద్ద వంశధార నదిలో సోమవారం జరిగే స్వామివారి చక్రతీర్థ స్నానాల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. పాడ్యమి గడియలు తగలుగానే మధ్యాహ్నం 12 గంటలకు ఆలయంలోని పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ బయటకు తెచ్చి నంది వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహిస్తారు. మిరియాపల్లి వద్ద వంశధార నదికి చేరుకుంటారు. అక్కడ మిరియాపల్లి గ్రామస్థులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం వంశధారలో పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలకు చక్రతీర్థ స్థానాలు చేస్తారు. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టెక్కలి డీఎస్పీ బాలచంద్రరెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. 300 మంది పోలీసులతో పాటు 3 రోప్ పార్టీలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిరియాపల్లి రేవులో బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడుపుతున్నట్లు శ్రీకాకుళం 2వ డిపో మేనేజరు శర్మ తెలిపారు. శ్రీకాకుళం నుంచి శ్రీముఖలింగం తిరిగే 6 సర్వీసులతో పాటు అదనంగా మరో 4 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. టెక్కలి నుంచి 3 బస్సులు వేసినట్లు చెప్పారు. ఇప్పటికే సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు శ్రీముఖలింగం చేరుకున్నారు.



చక్రతీర్థ స్నానాలకు వంశధార నది మిరియాపల్లి రేవులో ఏర్పాట్లు చేసిన బారికేడ్లు

ఘనంగా ఉమాకామేశ్వరి చక్రతీర్థ స్నానాలు

లుకలాం (నరసన్నపేట): లుకలాం గ్రామంలో త్రిశూల ఉమాకామేశ్వరి స్వామి చక్రతీర్థ స్నానాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కామేశ్వరపేట నుంచి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా వంశధార నదికి తీసుకువచ్చారు. ఆగమ పండితులు కన్నేపల్లి వెంకట శివరామ జోగయ్య శర్మ ఆధ్వర్యంలో కన్నేపల్లి వెంకట శ్రీరామమూర్తి దంపతులు అర్చన చేసి జాతరను ప్రారంభించారు. పురోహితులు నగరంపల్లి సుబ్రహ్మణ్య సోదరులు, సుసరాం సూర్యం నదీ తీరాన ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, గార తదితర మండలాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి చక్రతీర్థస్నానాలు చేశారు. నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు.



స్వామికి చక్రతీర్థ స్నానాలు చేయిస్తున్న దృశ్యం



వంశధారలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

ఇంకెంతమంది చావాలి

- శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారిని పట్టించుకోని పాలకులు
- నిలిచిన విస్తరణ పనులు
- దారుణంగా మారిన రోడ్డు
- నిత్యం ప్రమాదాలు



- గతేడాది డిసెంబరులో శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారిపై జరిగిన ప్రమాదంలో సరుబుజ్జిలి మండలం షలంత్రి గ్రామానికి చెందిన మామిడి బాబూరావు అనే యువకుడు మృత్యువాత పడ్డాడు. సరుబుజ్జిలి మండలం షలంత్రి గ్రామానికి చెందిన మామిడి బాబూరావు ఓ బ్యాంకులో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. తన తోటి ఉద్యోగితో కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం నుంచి సరుబుజ్జిలికి వెళ్తుండగా సనపలవానిపేట వద్ద గతుకుల రోడ్డుపై ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు.



- ఇదే రహదారిపై ఈ నెల 6న జరిగిన ప్రమాదంలో ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామానికి చెందిన చింతాడ ముకుందరావు అనే ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న ఆయన్ను వంజంగి వద్ద లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో లారీ రాంగ్ రూట్‌లో వచ్చింది. దీంతో ఈ ప్రమాదం జరిగింది.



రాగోలు వద్ద గోతులమయంగా రోడ్డు, గుంతలో పడి లారీ చక్రాలు ఊడిన దృశ్యం (ఫైల్)



(ఆమదాలవలస)

శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు విస్తరణ పనులు పూర్తికాకపోవడంతో ఈ మార్గంలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారంతా గోతులమయం కావడంతో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పో తుండగా మరికొందరు క్షతగాత్రులుగా మారుతున్నారు. గత మూడేళ్లలో ఈ రోడ్డుపై పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. ఆమదాలవలస, శ్రీకాకుళం నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఈ రహదారి విస్తర్ణకు గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 10 కిలోమీటర్ల పైబడి నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి గాను రూ.37 కోట్లు మంజూరు చేసింది. దీంతో కొత్తరోడ్డు జంక్షన్ వద్ద అప్పటి శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే, ఆ వెంటనే ఎన్నికలు రావడం.. వైసీపీ ప్రభుత్వం కొలువుదీరడం జరిగింది. దీంతో రీటెండరింగ్ పేరుతో శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డు పనులు ఆపేసింది. కొత్త టెండర్లను ఆహ్వానించి 2021 డిసెంబరులో మళ్లీ పనులు ప్రారంభించింది. ఈ పనులకు రూ.40కోట్లు మంజూరు చేసింది. రెండేళ్లలో పనులు పూర్తికావాల్సి ఉన్నా ఇప్పటికీ పూర్తికాలేదు. పనులు అర్ధాంతరంగా వదిలేయడంతో గోతుల రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే నిధులు సరిపడవని వైసీపీ ప్రజాప్రతినిధులు కోరడంతో అదనంగా రూ.18 కోట్లను ముఖ్యమంత్రి కేటాయించారు. కానీ పనులు మాత్రం పూర్తికాలేదు. విస్తరణ పేరుతో రోడ్డును తవ్వేసి వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మెటల్, క్రషర్ బుగ్గి వేసి విడిచిపెట్టడంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము, ధూళి ఎగిరి ప్రయాణికుల కళ్లల్లో పడుతోంది. గోతుల వల్ల వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. భారీ వాహనాల కట్టలు విరిగిపోతున్నాయి. చక్రాలు కూడా ఊడిపోయి రహదారిపై పరుగులు పెడుతుండడంతో ప్రజలు, ప్రయాణికులను భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఈ రోడ్డు పనులపై ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆమదాలవలస సివిల్ న్యాయాధికారి రోడ్లు భవనాలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను విచారణకు పిలిచి వివరణ కోరారు. తాత్కాలికంగా గుంతలు పూడ్చి వేయించి చదును చేస్తామని కోర్టులో అంగీకరించిన ఇంజనీరింగ్ అధికారి దానిని పెడచెవిన పెట్టడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ రోడ్డు ఒకపక్క స్పీకర్ తమ్మినేని సీతారాం నియోజకవర్గ పరిధిలో, మరోపక్క మంత్రి ధర్మాన ప్రసాదరావు నియోజకవర్గ పరిధిలో ఉంది. అయినా పనుల పూర్తి చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకెంతమంది చావాలి అని ప్రశ్నిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు

జిల్లా వ్యాప్తంగా వైసీపీకి చెందిన నేతలు, కార్యకర్తలు ఆదివారం పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

పేదల భూములకు మంగళం పాడేందుకు కొత్త చట్టాలు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్
- వైసీపీ సర్పంచ్ ఆధ్వర్యంలో 80 కుటుంబాలు పార్టీలో చేరిక

సరుబుజ్జిలి, మార్చి 10: రాష్ట్రంలో పేదల భూములకు మంగళం పాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టాలను రూపొందించిందని, ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో బలవంతుల చేతుల్లోకి భూములు మారనున్నాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. ఆదివారం సరుబుజ్జిలి మండలం గోనెపాడు వైసీపీ సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ, వైసీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 80 కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. స్పీకర్ తమ్మినేని సీతారాం టీడీపీని నమ్ముకున్న సీనియర్ కళింగ వైశ్య నాయకుడు భోగి ఆంజనేయులకు చెందిన రూ.10 కోట్ల భూములను బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని వారి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు చట్టం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీపాన రామచంద్రమూర్తి, శివ్వాల సూర్యనారాయణ, అంబాల రాంబాబు, కిల్లి సిద్దార్థ, నూక కోటేశ్వరరావు, నందివాడ గోవిందరావు, లావేటి పూర్ణారావు, ఎంపీటీసీ మెట్ట రాము, జనసేన నాయకుడు పైడి మురళీమోహన్, మాజీ ఎంపీపీ కాద అప్పలనాయుడు, తెలుగుమహిళ మండలాధ్యక్షురాలు పేడాడ మణి, తెలుగు యువత నాయకులు తాడేల రాజారావు, నూక ప్రభాకర్, కూన రాము పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: రవికుమార్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్ అమ్మాయమ్మ, అనుచరులు

పలు గ్రామాలనుంచి 150 కుటుంబాలు..

పలాసరూరల్/హరిపురం: టీడీపీతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. ఆదివారం పలాస మండలం రాజగోపాలపురం, మందస మండలం కొండ్రుగాం, మేఘమాల గ్రామాల్లో వందలాది మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ-జనసేన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని, ఈ ఎన్నికలు పార్టీకి అత్యంత కీలకమని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలు వైసీపీ హయాంలో పూర్తిగా అభివృద్ధికి నోచుకోక తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అందువల్ల టీడీపీలో చేరుతున్నామన్నారు. రాజగోపాలపురం నుంచి 70 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మందస మండలం గండ్రుగాం, మేఘమాల గ్రామాల్లో 80 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీలో చేరిన వారిలో గండ్రుగాం గ్రామం నుంచి సవర పుష్ప, జ్యోతి, సోంటారి, జమున, లక్ష్మి, రేవతి, విజయలక్ష్మి, అశ్విని, ఉష, అన్నమ్మ, మగతమ్మ, సవర డొంబురు, సవర విజయ్, భానుమతి, వసంత, సంధ్య, భీష్మా, ప్రసాద్, శ్యామ్ తదితరు లున్నారు. మేఘమాల నుంచి సవర కొంటాడు, సవర చక్రపాణి, దున్న వీరాస్వామి, సవర ఆనందరావు, ఈశ్వరి, అద్యాని, మోహిని, లోక్‌నాథ్, హింత్, ఉమాపతి తదితరులున్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దుర్గారావు, టీడీపీ నాయ కులు పీరికట్ల విఠల్, వజ్జ బాబూరావు, కుత్తుమ లక్ష్మణరావు, లొడగల కామేశ్వరరావు, బావన దుర్యోధన, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, తమిరి భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, మహేష్, తిరుపతిరావు, చంద్రశేఖర్, సవర శంకర్, లభియా, మంగళపాత్రో, దేవాసిస్ పండా తదితరులు పాల్గొన్నారు.



హరిపురం: గండ్రుగాంలో టీడీపీలో చేరిన వారితో గౌతు శిరీష

బాణాంలో వైసీపీకి ఎదురుదెబ్బ

పొందూరు: బాణాం గ్రామంలో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. పదేళ్లుగా వైసీపీ విధేయులుగా ఉన్న 40 కుటుంబాలు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సమక్షంలో ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బాణాం మాజీ సర్పంచ్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో ఆయా కుటుంబాలకు చెందిన 120 మందికి రవికుమార్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు అన్నెపు రాము, వండాన మురళి, బి. శంకరభాస్కర్, బాడాన గిరి, రఘురాం, పప్పల వేణు, కె.శ్రీనివాసరావు, వై.రమణ. వీఆర్‌ఎల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపేట నుంచి..

జలుమూరు (సారవకోట): కిడిమి పంచాయతీ గొల్లపేట గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. నవరడ్డపనస టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొర్రాయి బుజ్జి, బొల్ల రాజారావు, కొర్రాయి ప్రసాద్, శిమ్మయ్యల తదితరులున్నారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో అన్నివర్గాలకు నయవంచన చేస్తోందని, అందువల్ల టీడీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు సురవరపు తిరుపతిరావు, సాధు చిన్నికృష్ణం నాయుడు, కోనారి సింహాచలం, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

100 కుటుంబాలు టీడీపీలో చేరిక

సోంపేట: టీడీపీలోకి వస్తున్న వలసలే రానున్న ఎన్నికల్లో గెలుపును సూచిస్తోందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఆదివారం ఎంజీపురం పంచాయతీ బకుడ గ్రామానికి చెందిన 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. భగవాన్, లక్ష్మణ్, జీవన్నాయక్, జగన్నాథ్ తదితరులు చేరగా వారికి అశోక్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్, మద్దు రవి పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన మహిళలతో ఎమ్మెల్యే అశోక్

జనసేన పార్టీలోకి..



కండువాలు వేసి ఆహ్వానిస్తున్న దుర్గారావు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 18, 19 వార్డుల్లోని పలువురు జనసేన పార్టీలో చేరారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు కండువాలు వేసి ఆహ్వానించారు. వీరంతా నందిగాం ధర్మారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోన కృష్ణారావు, దిలీప్ కుమార్, పాణిగ్రాహి, గిరీష్, సందీప్, రాము తదితరులు పాల్గొన్నారు.

మీవెంటే ఉంటాం..

- అచ్చెన్నాయుడుతో యాదవ ప్రతినిధులు



అచ్చెన్నతో బీసీ సాధికారత సంఘ నాయకులు

టెక్కలి: నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మీ పాలన అవసరమని, అందుకే మీ వెంటే ఉంటామని అచ్చెన్నాయుడుతో కోటబొమ్మాళి మండలం పాకివలస ప్రాంతానికి చెందిన యాదవ సంఘ నాయకులు అన్నారు. ఈ మేరకు ఆదివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి విన్నవించారు. రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత మీది.. అభివృద్ధి నావంతు అంటూ వారికి అచ్చెన్న భరోసా ఇచ్చారు. అచ్చెన్నాయుడును యాదవ సంఘ నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సాధికారత కన్వీనర్ ఇప్పిలి జగదీష్, యాదవ సంఘ నాయకులు మన్నేల మల్లేసు, బూర్లె జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష రూపుమాపాలి

పలాసరూరల్: దేశంలో మహిళలపై చూపుతున్న వివక్షను రూపుమాపాలని అఖిల భారత ప్రగతి శీల సంఘం సభ్యురాలు తామడ వరలక్ష్మి అన్నారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మంది రంలో ఆదివారం అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చట్టసభల్లో మహిళలకు గౌరవం లేదని, మహిళలపై హింసలు పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘ సభ్యులు పోతనపల్లి సుందరమ్మ, గేదెల జయసుధ, బొడ్డు వరాలమ్మ, పత్తిరి కామాక్షమ్మ, బొడ్డు వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి మూకుమ్మడి రాజీనామా

మెళియాపుట్టి: వైసీపీ జిల్లా కోశాధికారి లోతుగడ్డ తులసీ వరప్రసాద్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మెళియాపుట్టికి చెందిన ఆయన మద్దతుదారులు ఆదివారం మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానికులకే పాతపట్నం టికెట్ ఇస్తే పార్టీ విజయానికి సహకరిస్తామని, ఒకవేళ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి టికెట్ కేటాయిస్తే సహకరించేది లేదని స్పష్టం చేశారు. రాజీనామా చేసిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ బమ్మిడి జగన్నాథం, రట్టిణి సర్పంచ్ మంజులా శ్యామల్, ఏఎంసీ డైరెక్టర్ గండేటి చిన్నారావు, జి.వెంకటలక్ష్మి, వైసీపీ యువజన నాయకుడు నిద్రబంగి విజయ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి పాడి వెంకట్ తదితరులున్నారు.

230 మందికి వైద్య పరీక్షలు

కొత్తూరు: మండలానికి చెందిన శ్రీభగత్‌సింగ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ అగతముడి అప్పలనాయుడు సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నెపు శశిధర్ రోగులను పరీక్షించారు. సుగర్, బీపీ, క్యాన్సర్, న్యూరోపతి, ఎముకలకు సంబంధించిన వ్యాధులపై పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పూడి ధారాసింగ్, చారిటబుల్ సభ్యులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించకపోవడం అన్యాయం

పాతపట్నం: పాతపట్నం రోడ్డు విస్తరణలో భాగంగా మా సంఘానికి చెందిన సెంటు భూమి పోయిందని, పరిహారం అందించాలని విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వీర బ్రహ్మేంద్ర విశ్వకర్మ సేవా సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంఘానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు గణపతి, కొత్తపల్లి రవి, ఉపేంద్ర ఆచారి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనుల పరిశీలన



మెళియాపుట్టి: ఎంపీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.5 లక్షలతో పెద్దపద్మాపురం చేపట్టిన కాలువ నిర్మాణం పనులను మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి ఆదివారం పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలు వల పనులు చేపడుతున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో తట్టెడు మట్టి వేసిన దాఖలాలు లేవన్నారు. నాయకులు శ్రీధర్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

సంతబొమ్మాళి: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.ఉమాసుందరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

చెడు ప్రవర్తనలకు దూరంగా ఉండాలి: ఎస్పీ రాధిక



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్పీ రాధిక



వజ్రపుకొత్తూరు: క్రీడాకారులకు వాలీబాల్ అందించి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ

మెళియాపుట్టి, మార్చి 10: యువత చెడు ప్రవర్తనలకు దూరంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. చాపరలో నియోజకవర్గ కమ్యూనిటీ పోలీసింగ్ క్రీడా పోటీల ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడల వైపు దృష్టి చారించాలన్నారు. మాదక ద్రవ్యాలు అమ్మకాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి ఒక్కరు చదువుపై దృష్టిసారించి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పోలీసులు ప్రజల మధ్య స్నేహ పూర్వక వాతావరణం ఉండాలన్నారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గంలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేంద్ర రెడ్డి, కొత్తూరు, పాతపట్నం సీఐలు వేణుగోపాలరావు, నల్లి సాయి, ఎస్ఐలు టి.రాజేష్, యాసిన్, నారాయణస్వామి తది తరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

కొత్తూరు: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. లబ్బ గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య శిబిరాల్లో స్పెషలిస్టులు మీ గ్రామాలకు వస్తున్నారని, వైద్యసేవలు పొందాలని కోరారు. ఈ సందర్భంగా 800 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు. వాలీబాల్ పోటీల్లో మహర్తాపురం విజేత కాగా నివగాం జట్టు రన్నర్‌గా నిలువగా ఎస్పీ సర్టిఫికేట్లు, ట్రోఫీలను ఎస్పీ పంపిణీ చేశారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, కొత్తూరు సీఐ వేణుగోపాల్, కొత్తూరు, హిరమండలం ఎస్ఐలు అహ్మద్, నారాయణస్వామి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

పలాస/వజ్రపుకొత్తూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి అన్నారు. ఎస్పీ ట్రోఫీ క్రీడల్లో భాగంగా పలాస, వజ్రపు కొత్తూరుల్లో క్రికెట్, వాలీబాల్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. గ్రామస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడా పోటీలతో పాటు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారుల మధ్య స్నేహపూరిత వాతావరణం కలిగి ఉండాలన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు పారినాయుడు, రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ జాగృతి కోసం ప్రాణాలర్పిస్తాం

- ఆమరణ దీక్షలకు పలువురు సంఘీభావం

పాతపట్నం: ఆదివాసీల జాగృతి కోసం ప్రాణాలైనా అర్పిస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, జిల్లా ప్రధాన కార్యదర్శి బైదలాపురం సింహాచలం స్పష్టం చేశారు. నకిలీ బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చవద్దంటూ చేపట్టిన ఆమరణ దీక్ష ఆదివారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ-ఎకు చెందిన వడ్డి కులస్థులు నకిలీ బెంతు ఒరియాలుగా చలామణి అవుతూ ఎస్టీ ధృవీకరణ పత్రాలు పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆరు శాతం రిజర్వేషన్‌లో ఇతర కులాల వారు నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందడం దారుణ మన్నారు. దీంతో అసలైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. వీరిలో బీసీ-ఏకి చెందిన వడ్డికులస్థులు సుమారు 2వేల నకిలీ పత్రాలతో విశాఖ బీహెచ్‌పీవీలో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణకు గాను సంఘీభావ ఉద్యమాలు చేపట్ట నున్నా మన్నారు. ఈ సందర్భంగా ఆమరదీక్ష చేస్తున్న వారికి పలు సంఘాల నేతలు సంఘీ భావం తెలిపారు. కార్యక్రమంలో సంఘ నేతలు గురాడి అప్పన్న, యడ్ల సూర్యనారాయణ, ఆజారి రామారావు, మల్లిపురం శ్రీను, బైరిసింగి సింహాచలం, కొల్ల శారద, మాళువ లోకేశ్వరి, ఆనందరావు పాల్గొన్నారు.



ఆమరణ దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వక్త

క్రికెట్ విజేత కొత్తూరు జట్టు

నరసన్నపేట: మహారాత్రి సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన డే అండ్ నైట్ డీపీఎల్ ప్రీమియం లీగ్ ట్రోఫీ-5ను కొత్తూరు జట్టు కైవసం చేసుకుంది. ఈ లీగ్ మ్యాచ్‌లో 32 జట్లు పాల్గొనగా నాకవుట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. ఆదివారం కొత్తూరు, సత్యవరం జట్ల మధ్య ఫైనల్ పోటీలో కొత్తూరు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. విన్నర్ జట్టుకు రూ.50 వేలు నగదు, రన్నర్ జట్టుకు రూ.25 వేలు నగదుతో పాటు ట్రోఫీలను పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.శంకరరావు, రాము, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో రోడ్లు దారుణం



మెళియాపుట్టి: గిరిజన గ్రామాల్లో రోడ్లు దారుణంగా ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదని దండకారణ్య ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు సవర కుమార్ అన్నారు. ఆదివారం ఎర్రమనుగూడ, నేపలోవ గ్రామాల్లో రోడ్లను పరిశీలించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లవుతున్నా రోడ్ల నిర్మా ణం చేపట్టకపోవడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించిందని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

శివాలయాల అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న ఎంజీఆర్

హిరమండలం/కొత్తూరు: హిరమండలం, కొత్తూరు మండలాల్లోని శివాలయాల అభివృద్ధికి టీడీపీ నాయకుడు మామిడి గోవిందరావు విరాళాలు అందజేశారు. హిరమండ లంలో వీరభద్ర స్వామి ఆలయానికి రూ.25 వేలు, కొత్తూరు మండలం సోమరాజపురం శివాలయానికి రూ.15 వేలు అందించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు, పండితులు ఆశీర్వదించారు. ఆలయాల నిర్వాహకులు ఆయనను అభినందించారు.

మండల దివ్యాంగుల సంఘ కార్యవర్గ ఎన్నిక

సంతబొమ్మాళి: మండల దివ్యాంగుల హక్కుల వేదిక మండల కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం సంతబొమ్మాళిలో ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా బి.ఎర్రంనాయుడు, ప్రధాన కార్యదర్శిగా పి.లక్ష్మీనారాయణ, మహిళ అధ్యక్షురాలిగా కె.లక్ష్మి, కార్యవర్గ సభ్యుడిగా కె.అప్పారావు తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

నందిగాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఎటువంటి ఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. ఐదో తరగతి ప్రవేశానికి 253 మందికి గాను 220 మంది హాజరయ్యారు. 33మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ ప్రవేశ పరీక్షకు 165 మందికి గాను 154 మంది హాజరు కాగా 11మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ బి.దమయంతి తెలిపారు. పరీక్షలను రాష్ట్ర పరిశీలకుడు జి.విజయ్ బాబు, జిల్లా సమన్వయకర్త ఎల్.బాలాజీనాయక్, నందిగాం ఎం ఈవో-2 ఎ.చిన్నారావు పరిశీలించారు. పరిశీలకురాలిగా భారతీదేవి వ్యవహరించారు.

ఒడిశా

గంజాయి పట్టివేత

పర్లాకిమిడి: మోహన సమితి ఖర్బబడి ప్రాంతంలో మోటారు సైకిల్‌పై రవాణా చేస్తున్న గంజాయిని ఆదివారం పట్టుకున్నట్లు ఏఎస్ఐ ప్రసన్నకుమార్ తెలిపారు. ఖర్బబడి ప్రాంతంలో బైక్‌పై వస్తున్న వ్యక్తిపై అనుమానంతో తనిఖీ చేయగా అతని వద్ద 16 కేజీల గంజాయి లభ్య మైందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళలు సాధికారిత సాధించాలి

పర్లాకిమిడి: మహిళలు సాధికారిత సాధించిననాడు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని వక్తలు అన్నారు. రాష్ట్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మహిళా వారోత్సవంలో భాగంగా లంక సీత ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా సమాఖ్య సభ్యులు జూమ్ ద్వారా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలకు సరైన ఆదరణ కరు వైందని, వారికి ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. ఈ సందర్భంగా లలిత సంఘం మహిళలు డాక్టర్ పాండ్రంగి శారదను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఎండల మల్లన్నకు విభూదితో అభిషేకం

టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం విభూదితో అభిషేకం చేశారు. అనంతరం విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, సర్పంచ్ బాలకృష్ణ, ఎంపీటీసీ కిషోర్, భక్తులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి వితరణ

సంతబొమ్మాళి: ఎం.మరువాడలో షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి జిల్లా మత్స్యకార సహకార సంఘ డైరెక్టర్ సూరాడ జోగారావు, సతీమణి హేమలత రూ.51 వేలు వితరణ చేశారు. ఈ మొత్తాన్ని ఆదివారం ఆలయ ధర్మకర్త కొమర పోలయ్యకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ప్రభుత్వం

నరసన్నపేట: పేద మహిళలకు అండగా ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం స్థానిక పైడితల్లి ఆలయం వద్ద చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళీ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సరుబుజ్జిలి: వీరభద్రాపురం గ్రామానికి చెందిన సనపల వెంకటరమణ(23) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ బి.నిహార్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. వెంకటరమణ దుబారా ఖర్చులకు అలవాటు పడి వివిధ ప్రాంతాల్లో అప్పులు చేశాడు. ఈనేపథ్యంలో రుణబాధలు తట్టుకోలేక నిత్యం మనోవేదనతో ఉండేవాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన తమ కుమారుడు ఆదివారం ఉదయానికి సరుబుజ్జిలికి సమీపంలో ఉన్న జీడితోటలో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందినట్టు తల్లి సనపల వజ్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా వెంకటరమణ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆయనకు భార్యతోపాటు మూడు నెలల కుమార్తె కూడా ఉంది.

మేడపై నుంచి జారి పడి యువకుడి మృతి

పలాస రూరల్: పలాస మండలం తర్లాకోట క్వారీలో పని చేస్తున్న సవర ప్రకాశ్ (34) శనివారం రాత్రి మేడపై నిద్రిస్తూ ప్రమాదవశాత్తు జారి మృతి చెందినట్లు క్వారీ నిర్వాహకుడు పెంట బాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతి చెందిన విషయాన్ని ఆదివారం రాత్రి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడు ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన వాడన్నారు. ఎస్‌ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీడి పరిశ్రమలో అగ్నిప్రమాదం

పలాస: స్థానిక అన్నపూర్ణ థియేటర్ రోడ్డు వద్ద మల్లా వెంకటరాజు నిర్వహిస్తున్న వరుణ్ జీడి పరిశ్రమలో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపకసిబ్బంది సకాలంలో వచ్చి మంటలను అదుపుచేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో జీడి వ్యర్థాలు కాలిపోగా, రవాణాకు సిద్ధంగా ఉంచిన జీడిపప్పుపై నీరు పడడంతో అవి తడిసిపోయాయి. పరిశ్రమ ఆవరణలో ఉన్న విద్యుత్ వైర్ల వద్ద తొలుత మంటలు వ్యాపించినట్టు స్థానికులు చెబుతున్నారు. అనంతరం పరిశ్రమలో జీడిపప్పు నిల్వ ఉంచిన గొడాములోకి మంటలు వ్యాపించి ఈ ప్రమాదం జరిగింది. ఘటన స్థలానికి జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, కార్యదర్శి కేవీ శివకృష్ణ, పరిశ్రమదారులు చేరుకొని సంబంధిత పరిశ్రమ యజమానికి ఓదార్చారు. ఈ మేరకు అగ్నిమాపకశాఖ అధికారులు కేసు నమోదు చేసుకున్నారు.

పాతపట్నంలో దొంగల హల్‌చల్

పాతపట్నం: పాతపట్నంలోని విద్యానగర్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. మూడు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డారు. వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో బాధితులు కుటుంబ సభ్యులతో క్యాంపుల్లో ఉండగా శనివారం రాత్రి దొంగతనాలు జరిగాయి. బాధితులు ఆదివారం ఇళ్లకు చేరడంతో దొంగతనాలు జరిగినట్లు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో స్థానిక విద్యానగర్‌కు చెందిన టెక్కలి ఐతం కళాశాల ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ధర్మాన లోకనాథం లాబర, గంగువాడ జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు మామిడి షన్ముఖరావు ఆమదాలవలసలోని అత్తారింటికి, ఒడిశాలో ఉపాధ్యాయుడు కొర్రాయి రాము కొరసండ స్వగ్రామానికి వెళ్లారు. శనివారం రాత్రి ఎవరూలేనిగృహాలే లక్ష్యంగా చేసుకుని ఇంటి తలుపులకు తాళాలు, బీరువాల తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. సమాచారం తెలియడంతో ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్ ఘటనా స్థలాన్ని సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ధర్మాన లోకనాథం ఇంట్లో రూ.ఐదు వేలు, రెండు తులాల బంగారు ఆభరణాలు, మామిడి షణ్ముఖరావు ఇంట్లో వెండి గ్లాస్ దొంగిలించారు. కాగా ఈమేరకు క్లూస్‌టీం వచ్చి ఘటనాస్థలాన్న పరిశీలించింది. బాధితుల ఫిర్యాదుమేరకు ఎస్‌ఐ మహమ్మద్ యాశిన్ కేసు నమోదుచేశారు.

'నారాయణస్వామి క్షమాపణ చెప్పాలి'

పొందూరు: తిరుపతిలో నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ వ్యాఖ్యలు చేసిన ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి రాష్ట్రప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి స్వామి శ్రీనివా సానంద డిమాండ్ చేశారు. కృష్ణాపురం ఆనందాశ్రమంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి దర్శనానికి వెళ్లిన నారాయణస్వామి బయటకు వచ్చి జగన్ భజన చేయడం, రాజకీయాలు మాట్లాడడం తగదన్నారు. గత ప్రభుత్వసమయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పెద్ద పీట వేస్తే, వైసీపీప్రభుత్వంలో మంత్రులు, నాయకులు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.రాజ్యాంగాన్ని పరిరక్షిం చాల్సిన ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి తను అన్యమ తస్థుడైనా తిరుమల దేవస్థానంలో కనీసం సంతకం చేయకుండా దర్శనానికి వెళ్లారన్నారు. ఈ ఐదేళ్లలో ఒక్కసారి కూడా బ్రహ్మోత్సవాలకు సతీసమేతంగా హాజరుకాకుండా హిందువులు, వెంకటేశ్వరస్వామి భక్తులకు అవమానించారన్నారు. నారాయణస్వామి తిరుమలను రాజకీయవేదికగా మలచుకోవడం క్షమించరాని నేరమన్నారు. తిరుమల పవిత్రతను దిగజారుస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్రప్రజలు బుద్ధిచెబుతారన్నారు.

ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమే

శ్రీకాకుళం అర్బన్: ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమనని, వారి డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి జిల్లాకు తొలిసారిగా విచ్చేసిన చౌదరి పురుషోత్తంనాయుడుకు అభినందన సభ స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి ప్రభుత్వ సలహాదారు, ఏపీఎన్జీవో రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ధర్మాన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, అనేక వ్యవస్థల్లో తీసుకొచ్చిన సంస్కరణలు దేశవ్యాప్తంగా ఆకర్షించాయన్నారు. ప్రభుత్వానికి ఉద్యోగులకు మధ్య చిన్న, చిన్న ఘర్షణలు ఉండడం సహజమేనన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పోరాటాలను ఎన్నడూ తప్పుగా తీసుకోలేదని, వారి డిమాండ్ల సాధ్యాసాధ్యాలను ఆలోచించి ఉద్యోగులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. చౌదరి పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చడంలో ఉద్యోగులు ముందుంటామని, కొందరు విమర్శిస్తున్నట్లు తాము ఏ ప్రభుత్వానికి దగ్గర కామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, పూర్ణ పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక



ఒకే చోట కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

జి.సిగడాం: స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఆత్మీయకలయికను ఏర్పాటు చేసుకున్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు అపూర్వ కలయికను వేదికగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి ఘనంగా సన్మానించారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని సంతోషంగా గడిపారు.

ధనరాజ తులసమ్మ సంబరం



అమ్మవారి ఘటాలతో ఊరేగింపు

ఇచ్ఛాపురం: లొద్దపుట్టిలో ధనరాజ తులసమ్మతల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మునిసిపాలిటీలోని బెల్లు పడలో గల 13వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రెయ్యి జానికిరావు, సత్యవతి దంపతులు నిర్వహించిన సంబరంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల ఘటాలను తలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. 12వ వార్డు కౌన్సిలర్ బుడ్డెపు త్రినాథ్ దంపతులు కూడా అమ్మవారి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, టీడీపీ నాయకులు జాని, ఆర్.జానకిరావు, శంకరరెడ్డి పాల్గొన్నారు.



నరసన్నపేట: కరగాంలో బాబు ష్యూరిటీలో పాల్గొన్న బగ్గు రమణమూర్తి తదితరులు



టెక్కలి: సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న బగాది శేషగిరి



జి.సిగడాం: అవగాహన కల్పిస్తున్న నాయకులు

రాష్ట్రానికి మంచిరోజులు

● మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం కరగాం పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీ-జనసేన ఎన్డీయేలో చేరాయన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన- బీజేపీ కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, శిమ్మ లక్ష్మణరావు, సాదు ఆనంద్, పాగోటి ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో ప్రజలకు ప్రయోజనం

ఎచ్చెర్ల: టీడీపీ, జనసేన ఉమ్మడిగా ప్రకటించిన సూపర్ సిక్స్‌తో రాష్ట్ర ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. పూడివలసలో ఆదివారం సాయంత్రం ఆయన సూపర్ సిక్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు, బెండు మల్లేశ్వరరావు, పార్టీ నేతలు గొలివి గోవిందరావు, పైడి ముఖలింగం, అన్నెపు భువనేశ్వరరావు, పైడి అన్నంనాయుడు, గట్టెం శివరామ్, పప్పల వెంకటరమణమూర్తి, సనపల హరి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌పై అవగాహన

రణస్థలం: ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని టీడీపీ నేతలు ఎం.కనకారావు, రౌతు శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కిమిడి కళావెంకటరావు ఆదేశాల మేరకు ఆదివారం పైడిభీమవరంలో బాబు సూపర్ సిక్స్ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ప్రజలకు కోరారు.

మునిసిపాలిటీలో పరిధిలో..

ఆమదాలవలస: మునిసిపాలిటీలో పరిధిలోని పదో వార్డు గాంధీనగర్, హడ్కోకాలనీ తదితర ప్రాంతాల్లో ఆదివారం నాయకులు నాగళ్ల మురళీధర్, ఎన్ని శ్రీదేవి ఆధ్వర్యంలో టీడీపీ శంఖారావంలో భాగంగా సూపర్‌సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, మహిళలు ఇంటింటికి వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటుచేసిన తర్వాత ప్రజలకు అందించనున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు.

● **సరుబుజ్జిలి:** మండలంలోని చిగురువలసలో టీడీపీ నాయకులు కొర్ను సూర్యనారాయణ, అత్తులూరి గిరి, తోట రాంబాబు ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ కార్యక్రమంతో పాటు శంఖారావం సూపర్‌సిక్స్ కార్యక్రమాన్ని ఉత్సాహంతో నిర్వహించారు.



ఎచ్చెర్ల: పూడివలసలో అవగాహన కల్పిస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

కొనుసుల కొత్తూరులో..

టెక్కలి: కొనుసుల కొత్తూరు గ్రామంలో ఆదివారం టీడీపీ నేతలు సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను, టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధ్యం

జి.సిగడాం: రాష్ట్రంలో స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణం బాబుతోనే సాధ్యమని మండల ఉపాధ్యక్షుడు కుదిరెళ్ల బుజ్జి అన్నారు. ఆదివారం జి.సిగడాం, పెనసాం, పెంట తదితర గ్రామాలలో బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రగతి, సంక్షేమ పాలన కోసం టీడీపీని గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.గోవిందరావు, సూరి రెడ్డి, నారాయణరావు, ఎ.ఈశ్వరరావు, మీసాల విజయమ్మ, పిల్లల సూర్యారావు, పిల్లల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు



రణస్థలం: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



సరుబుజ్జిలి: చిగురువలసలో నాయకులు..

రెండో రోజూ భక్తులకు నిరాశే

● ఆదిత్యుని తాకని కిరణాలు



క్యూలో వేచి ఉన్న భక్తులు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని రెండో రోజు ఆదివారం కూడా సూర్యకిరణాలు తాకలేదు. ఆకాశంలో మబ్బుపట్టి ఉండడంతో కిరణస్పర్శ దర్శనానికి వేకువ జాము నుంచే వేచి ఉన్న భక్తులకు నిరాశ తప్పలేదు. కాగా ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.4,48,387 ఆదాయం లభించింది. టిక్కెట్ల ద్వారా రూ.1,67,500, విరాళాల ద్వారా రూ.1,05,772, ప్రసాదాల ద్వారా రూ.1,75,115 ఆదాయం లభించిందని ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు తెలిపారు. అలాగే సూర్యనారాయణ స్వామివారిని ఎస్పీ జీఆర్ రాధిక దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

టీడీపీ.. బీసీలకు పుట్టినిల్లు

● పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

అరసవల్లి: బీసీలకు జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో అన్ని విధాలా మోసం చేశాడని, బీసీలే మాకు వెన్నెముక అని చెప్పి వారి ఓట్లతో గెలిచి వారిపైనే దాడులకు పాల్పడ్డాడని టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ బీసీలకు పుట్టినిల్లు అని అన్నారు. వైసీపీ నిరంకుశ పాలనను అంతమొందించడానికి, రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించడానికి బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్నామని, ఇది చరిత్రాత్మక అవసరమన్నారు. బీసీలకు చేసిన ద్రోహానికి జగన్‌రెడ్డి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు అందరూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో మనం రాష్ట్ర విభజన కన్నా ఎక్కువ నష్టపోయామన్నారు. జగన్‌రెడ్డి పాలనలో అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చి సంక్షోభంలోకి నెట్టారని, దీనిని సంక్షేమ రాష్ట్రంగా మార్చడం ఖాయమన్నారు. కులాలతో సంబంధం లేకుండా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలపై దాడులు జగన్‌రెడ్డి ప్రభుత్వం జరిగాయని, ఈ అకృత్యాలకు ముగింపు పలికే రోజు దగ్గరలోనే ఉందని అన్నారు. వైసీపీ పాలనలో ప్రభుత్వం అంటే కేవలం జగన్‌రెడ్డి, విజయసాయి రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డిగా మారిందని, ఈ వైసీపీ ప్రభుత్వంలో బీసీలను ఎంత హీనంగా చూశారో వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి మాటలే ఇందుకు రుజువన్నారు. జయహో బీసీ సభతో టీడీపీ బీసీల పార్టీ అని మరోసారి రుజువైందని అన్నారు. చంద్రబాబు దార్శనికత రాష్ట్ర ప్రజలకు రక్ష అని, తెలుగు ప్రజల కోసం, రాష్ట్ర అభ్యున్నతి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, బొనిగి భాస్కరరావు, పార్టీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, రాష్ట్ర తెలుకల సాధికార సమితి డైరెక్టర్ కొమ్మనాపల్లి వెంకటరామరాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్సీ రమణ మాదిగ, పేడాడ జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో సూర్యనమస్కారాలు



సూర్యనమస్కారాలు చేస్తున్న దృశ్యం

అరసవల్లి: మారుతి వాకర్స్ క్లబ్ ఎలైట్ గవర్నర్ కొంక్యాన మురళి, యోగా టీచర్ పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో 100 మంది సాధకులతో ఆదిత్యాలయ అనివెట్టి మండపంలో సామూహిక సూర్యనమస్కారాల సాధన కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీదినం సూర్యనమస్కారాలను సాధన చేయడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు దరి చేరవని, ఎంతో శక్తివంతంగా రోజంతా పనిచేసుకోవచ్చని అన్నారు. మారిన నేటి అధునికి జీవన శైలిలో ఈ సూర్యనమస్కారాల సాధన అత్యవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి పాల్గొన్నారు.

24న రాష్ట్రస్థాయి విద్యా సదస్సు

అరసవల్లి: ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు అప్పారి వెంకటస్వామి స్మారక రాష్ట్ర స్థాయి విద్యా సదస్సును ఈ నెల 24న శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు ఆధ్వర్యంలో ఆఫీసు బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఏకపక్ష నిర్ణయాలు, నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా, తెలుగుజాతి ఐక్యతకు చిహ్నంగా యూటీఎఫ్ స్థాపనలో క్రియాశీలంగా పనిచేసిన ఆదర్శజీవి ఏవీఎస్ అని కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, సహాధ్యక్షుడు బి.ధనలక్ష్మి, కె.దాలయ్య, కోశాధికారి బి.రవికుమార్, కార్యదర్శులు హెచ్.అన్నాజీరావు, పి.సూర్యప్రకాష్, జి.శారద, ఎస్.స్వర్ణకుమారి, ఎంవీ రమణ, పి.మురళీధర్, బి.గౌరీశ్వరరావు, బి.శంకరరావు, జి.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు



యువతతో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

అరసవల్లి: యువత బంగారు భవిష్యత్తు టీడీపీ పాలనతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి అన్నారు. ఆదివారం కిల్లిపాలెం గ్రామ పంచాయతీ, కునుకుపేటకు చెందిన యువకులు లక్ష్మీదేవి నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దూరదృష్టి గల చంద్రబాబు పాలనలోనే యువతకు ఉపాధి, విద్య అవకాశాలు అందుతాయని, వచ్చే ఐదేళ్లలో యువతకు లక్షలాది ఉద్యోగాల కల్పన చేయడం జరుగుతుందన్నారు.

రేపటి నుంచి చక్రధరుని డోలోత్సవాలు

కవిటి: బెజ్జిపుట్టుగలో వెలసిన చక్రధర పెరుమాళ్ల స్వామి డోలోత్సవాలు మంగళవారం నుంచి ఈనెల 25వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 26న జరిగే కామదహనం ఘట్టంతో ఉత్సవాలు ముగియనున్నాయని పేర్కొన్నారు. ఏటా ఫల్గుణ మాసం పౌర్ణమికి ముందు 15రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఖాదీని ప్రత్యేకంగా గుర్తించాలి

పొందూరు: పొందూరు ఖాదీని ఒకప్రత్యేక కళని, ఖాదీని చేనేతతో పోల్చకుండా ఖాదీని ప్రభుత్వాలు ప్రత్యేకంగా గుర్తించాలని జాతీయ కళలు సాంస్కృతిక వారసత్వ సంస్థ (ఇంటాక్) కన్వీనర్ నూక సన్యాసిరావు తెలిపారు. ఒన్‌డిస్ట్రిక్ట్-ఒన్‌ప్రొడక్ట్‌కు ఎంపికైన పొందూరు ఖాదీ అభివృద్ధికి ఏఎఫ్‌కేకే సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కామేశ్వరప్రసాద్, దండావెంకటరమణలను ఆదివారం అభినందించారు. ఏఎఫ్‌కేకే సంఘం అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌టాక్ కోకన్వీనర్ వావిలపల్లి జగన్నాధనాయుడుఇంటాక్ మాజీ కన్వీనర్ కేవీజే రాధాప్రసాద్, మాజీ కోకన్వీనర్ సురంగి మోహనరావు పాల్గొన్నారు.

యాదవులపై దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న సంఘ నాయకుడు

రణస్థలం: యాదవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అన్ని రాజకీయ పార్టీల్లో యాదవులకు ప్రాధాన్యత కల్పించాలని ఆ సంఘం నాయకుడు కాయిత వెంకటరమణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎచ్చెర్ల నియోజకవర్గం యాదవ సంఘం అధ్యక్షుడు కాయిత రమణ ఆధ్వర్యంలో యాదవ మహాసభ ఆత్మీయ కలయ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో చంద్రబోస్, మన్నేల శ్రీనివాసరావు, మొల్లి సన్నిబాబు, ముద్దాడ రాజశేఖర్, అప్పుయాదవ్, ఇడదాసుల తిరుపతి రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాజమ్మ యాత్ర



గార: వత్సవలసలో రాజమ్మ యాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి, మొక్కులు చెల్లించుకున్నారు. సీఐ ఎల్‌ఎస్ నాయుడు, ఎస్‌ఐ కె.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అర్హులకు ప్రమోషన్లు కల్పించండి

గుజరాతీపేట: జిల్లా పరిషత్ పరిధిలో గల అర్హులైన స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)లకు ప్రమోషన్ల విషయంలో కోర్టుకు వెళ్లిన వారికి మాత్రమే కాకుండా జీవో నెం.79 ప్రకారం అర్హులైన వారందరికీ ప్రమోషన్లు కల్పించాలని ఆ సంఘ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు విజయనగరంలో ఆదివారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను వారంతా కలుసుకుని వినతి పత్రాన్ని సమర్పించారు. సంఘం అధ్యక్షుడు ఎంపీ రమణ, కార్యదర్శి సాంబమూర్తి, విజయనగరం నుంచి రమణ, విశాఖ నుంచి అలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సంస్కారహీనుడు జగన్‌రెడ్డి'

పొందూరు: తోడబుట్టిన సొంత చెల్లెలు షర్మిల పుట్టికను తన సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించి అవమానించిన సంస్కారహీనుడు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. బాణాం గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తన గెలుపుకు అహర్నిశలా పాటుపడిన చెల్లిలిని, తల్లిని అవమానించి బయటకు పంపిన వ్యక్తి జగన్‌రెడ్డి అని అన్నారు. గత ఎన్నికల ముందు మద్య నిషేదం చేసి వచ్చే ఎన్నికల్లో ఓటు అడగడానికి వస్తానని చెప్పిన జగన్‌రెడ్డి మద్యంలో లక్షలకోట్లు కుంభకోణం చేసి మద్య నిషేదం అటకెక్కించిన జగన్‌రెడ్డిని అక్కచెల్లెమ్మలు నిలదీయాలని కోరారు. జగన్ ఓటమి ఖాయమని ఈ ఐదేళ్లలో జనసైనికులను, టీడీపీ కార్యకర్తలను వేధించిన ప్రతి ఒక్కరిని గుర్తుపెట్టుకుని బదులు తీర్చుకుంటామని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రామ్మోహన్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మోహన్, రాము, శంకరభాస్కర్, వండాన మురళి, బాడాన గిరి, వీఆర్‌ఎల్ నాయుడు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి కృషి

గార: జిల్లా రెడ్డి సంక్షేమ భవనం, కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆదివారం ఉదయం అంపోలు సమీపంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ కలయికలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు జిల్లాలో చెప్పుకోదగ్గ అభివృద్ధి చేసిందేమీ లేదని, రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, ఆంధ్రా క్రికెట్ బోర్డు ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి, నాయకులు సుగ్గు మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల విద్యాలయ ప్రవేశ పరీక్షలు

గుజరాతీపేట: బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేకుందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని తొమ్మిది కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో భాగంగా ఐదో తరగతి పరీక్షకు 1674 మందికిగాను 1418 మంది హాజరయ్యారు. ఇంటర్‌కు సంబంధించి 1479 మందికి 1329 మంది హాజరయ్యారు. జిల్లా సంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ సమన్వయాధికారి ఎస్.బాలాజీ, ప్రత్యేక రాష్ట్ర పరిశీలకులు జి.విజయబాబు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



తాళ్లవలస పంట పొలంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

లావేరు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఇందిరమ్మ అభయహస్తం పథకం కింద ప్రతీ నిరుపేద కుటుంబానికి నెలకు రూ.5వేలు అందించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కె.సింహాద్రినాయుడు అన్నారు. ఆదివారం తాళ్లవలస, రావివలస, బొడ్డపాడు గ్రామాల్లో కాంగ్రెస్‌కు ఓటేయాలని ఓటర్లను కోరారు. ఇందిరమ్మ అభయ హస్తం పథకంలో భాగంగా మహిళా లబ్ధిదారుల ఓటరు ఐడీకి ఫోన్ నెంబరు లింక్ చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కె.లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రమణ, నాయకులు ఆబోతుల జగదీస్ నాయుడు, మహంతి భాస్కరరావు, మీసాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.